సాక్షి
అనకాపల్లి
శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



దంచికొట్టిన వాన

IIలో

భారీ వర్షం కురవడంతో యలమంచిలి మండలంలో గెడ్డలు, వాగులు పొంగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



ఆలోచింపజేసిన నాటిక

మద్దిలపాలెం: వీఎండీఏ ఆధ్వర్యంలో శుక్రవారం కళాభారతి ఆడిటోరియంలో 'కలిసి ఉంటే' అనే నాటిక ప్రదర్శించారు.




వేంకటాద్రికి రాచబాట

పెందుర్తి: వేంకటాద్రి పైకి రూ.1.50 కోట్ల దేవదాయ ధర్మాదాయశాఖ, జీవీఎంసీ నిధులతో రోడ్ల నిర్మాణం చేపట్టారు.

న్యూస్‌రీల్

ఆవ గింజల విఘ్ననాయకుడు



ఆవగింజలతో గణనాథుడి చిత్రాన్ని రూపొందించారు తూటిపాలకు చెందిన మైక్రోరైటర్ రవికుమార్. శనివారం వినాయక చవితిని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందుకుగాను మొత్తం 2001 ఆవగింజలను వినియోగించినట్లు పేర్కొన్నారు. - మాకవరపాలెం

పెన్సిల్ ముల్లు మీద గణనాథుడు



పెన్సిల్ ముల్లు మీద విఘ్నేశ్వరుడు

మాడుగుల రూరల్: పెన్సిల్ ముల్లు మీద గణనాథుడిని చెక్కారు ఎం.కోడూరు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు నెయ్యిడొండ గోపాల్. ఇందుకు మూడు గంటల సమయం పట్టిందని ఆయన తెలిపారు. గతంలో గోపాల్ పెన్సిల్ ముల్లు మీద జాతీయ పతాకం, దేవతామూర్తుల విగ్రహాలు ఎన్నో చెక్కారు.

తాండవలో తగ్గిన ఇన్‌ఫ్లో

నాతవరం: తాండవ ప్రాజెక్టులో స్పిల్‌వే గేట్ల ద్వారా విడుదల చేసే నీటిని శుక్రవారం మధ్యాహ్నం నిలుపుదల చేశారు. గురువారం సాయంత్రానికి రిజర్వాయర్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి అధిక మొత్తంలో నీరు వచ్చి చేరడంతో స్పిల్‌వే గేట్ల ద్వారా నీరు విడుదల చేశామని, శుక్రవారం మధ్యాహ్నానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో నిలిపి వేశామని ప్రాజెక్టు డీఈ అనురాధ చెప్పారు.

వసంత ఫార్మా కెమికల్స్ దాతృత్వం

- ఏజెన్సీవాసులకు చేయూత
- రూ.2.50 లక్షల విలువైన దోమతెరల పంపిణీ



దోమతెరల కిట్లను అందజేస్తున్న వసంత ఫార్మా హెచ్‌ఆర్ ప్రతినిధి రాఘవయ్య

రాంబిల్లి (యలమంచిలి): ఏజెన్సీవాసులు దోమల బారిన పడి మలేరియా తదితర సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్న తరుణంలో వసంత ఫార్మా కెమికల్స్ పరిశ్రమ వారికి అండగా నిలిచింది. కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపుతో 1000 దోమతెరల కిట్లను అందించింది. రాంబిల్లి మండలంలోని వసంత ఫార్మా కెమికల్స్ పరిశ్రమ యాజమాన్యం రూ.2.50 లక్షల సీఎస్‌ఆర్ నిధులను ఇందు కోసం వెచ్చించింది. పరిశ్రమ హెచ్‌ఆర్ రాఘవయ్య శుక్రవారం అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వీటిని అందజేశారు.

ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంవోగా డాక్టర్ సుధా శారద



నర్సీపట్నం: నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంవోగా ఎన్.వి.సుధా శారదను నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డాక్టర్ సుధా శారద అల్లూరి జిల్లా చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలో ఆర్‌ఎంవో పోస్టు ఖాళీగా ఉండడంతో ఆ పోస్టులో సుధా శారదను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమె రెండు మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా..

విఘ్నేశ్వరుడు ఆదిదేవుడు. సిద్ధిని బుద్ధిని ప్రసాదించే పార్వతీ తనయుడు. పిల్లల నుంచి పెద్దల వరకు భక్తిశ్రద్ధలతో కొలిచే దైవం. అందుకే ఊరూ వాడా.. వీధి వీధినా మండపాలు ఏర్పాటు చేసి గణపయ్యను పూజిస్తారు. వివిధ రూపాల్లో స్వామి ప్రతిమను తయారు చేసి మురిసిపోతారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి కుడుములు, ఉండ్రాళ్లు ప్రసాదంగా సమర్పిస్తారు. పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చిన జనంతో శుక్రవారం మార్కెట్లు కిటకిటలాడాయి. ధరలు ఆకాశాన్ని అంటినా స్వామిని మనసు తీరా పూజించేందుకు అవసరమైన సామగ్రిని భక్తులు కొనుగోలు చేశారు.


- చవితి వేడుకలకు సర్వం సిద్ధం
- వీధి వీధినా వెలిసిన మండపాలు
- పూజా సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడిన మార్కెట్లు



కె.కోటపాడు మండలం ఆనందపురంలో పండ్లు, పూల అమ్మకాలు



పూజా సామగ్రి కొనుగోళ్లతో అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్‌లో రద్దీ





కె.కోటపాడులో వివిధ ఆకృతుల్లో తయారైన వినాయకుడి విగ్రహాలు



నర్సీపట్నంలో 1,116 వినాయక విగ్రహాలతో రూపుదిద్దుకున్న మహా గణేశుడు

సాక్షి, అనకాపల్లి: ఎందరు భక్తులో అన్ని రూపాలు.. ఎన్ని నేత్రాలో అన్ని దర్శనాలు.. వినాయకుడిని మొక్కుకుంటే విఘ్నాలు లేకుండా విజయం సిద్ధిస్తుందట.. ఎన్నో నిదర్శనాలు.. అందుకే భక్తులు ఇంటింటా పూజించుకుంటారు. వీధిలో మండపాలు ఏర్పాటు చేసి సామూహికంగా కొలుస్తారు. అన్ని మండపాలూ తిరిగి అందరు గణపతులను దర్శించుకుంటారు. ఈ ఏడాది అనకాపల్లి, నర్సీపట్నాల్లో వినూత్నంగా గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. నర్సీపట్నంలో మూడున్నర అడుగుల మట్టి వినాయక విగ్రహంపై 1,116 చిన్నసైజు మట్టి ప్రతిమలు అమర్చారు. ఈ విగ్రహాన్ని ధాన్యం, సగ్గు బియ్యం, ఆవాలు, గసగసాలు, ఎర్ర కందిపప్పు, బాదంపప్పుతో అలంకరించారు. మూషిక వాహనాన్ని ఆవాలుతో అద్దారు. అనకాపల్లి టౌన్‌లో గవరపాలెం సంతోషిమాత ఆలయం సమీపంలో రుద్రాక్షలతో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గవరపాలెం వేగిగారీసువీధిలో గోమోదిక గణపతి విగ్రహం, కొంకోటలో శ్రీ వేంకటేశ్వరస్వామి రూపంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

కిక్కిరిసిన మార్కెట్

పూజా సామగ్రి విక్రయాలతో శుక్రవారం మార్కెట్లు కిటకిటలాడాయి. అనకాపల్లిలోని నెహ్రూచౌక్, చిన నాలుగురోడ్ల కూడలి, నర్సీపట్నం అబిద్ సెంటర్, పాయకరావుపేటలో సూర్యమహల్ జంక్షన్, చోడవరం మెయిన్‌రోడ్డు, యలమంచిలిలో పోలీస్ స్టేషన్ రోడ్డు జంక్షన్ కిక్కిరిసిపోయాయి. కిరాణా, వస్త్ర, పండ్లు, పూల దుకాణాలు కిటకిటలాడాయి. బొమ్మలు, పువ్వులు, పత్రి, పండ్లు తోపుడు బండ్లపై విక్రయించారు. అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, చోడవరం, పాయకరావుపేట పట్టణాల్లో ఉదయం నుంచి విక్రయాలు జోరుగా సాగాయి. పూలు, పండ్లు అధిక ధరకు విక్రయించారు. జామ, మామిడి, వెలగ, జొన్నపొత్తులు, బత్తాయిలు, నారింజ, యాపిల్, పంపర పనస పండ్ల ధరలు భారీగా ఉన్నాయి. కొబ్బరికాయ ధర రూ.30 నుంచి 50 పలికింది. దేశవాళీ అరటిపండ్లు డజను సెంచరీకి చేరువైంది. పాలవెల్లి రూ.30కు, పత్రిని రూ.20 నుంచి రూ.50 వరకు విక్రయించారు.

శుభాలు కలిగించే స్వయంభూ విఘ్నేశ్వరుడు



చోడవరంలో చవితి పూజలకు సిద్ధమైన శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం

IIలో

క్రమశిక్షణతో మెలగాలి



గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకునేందుకు పోలీసుశాఖకు ప్రజలందరూ సహకరించాలి. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగు డాన్సులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఉత్సవాల పేరిట బలవంతంగా చందా వసూళ్లకు పాల్పడకూడదు. ఉత్సవాల నిర్వహణలో ఇతర మతాల వారికి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలి. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు, వినియోగించే మైకులు, సౌండు బాక్సులతో ప్రజలకు ఇబ్బందులుండకూడదు. మండపాల దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.

– ఎం.దీపిక, ఎస్పీ

వసతిగృహంలో సమస్యల వెల్లువ

- 3 గదుల్లో 180 మంది విద్యార్థినులు
- చినుకు పడితే చిత్తడే



బీసీ, ఎస్సీ విద్యార్థిని వసతిగృహం వార్డెన్‌తో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

అనకాపల్లి: మండలంలో గుండాల జంక్షన్ బీసీ, ఎస్సీ, విద్యార్థుల వసతి గృహంలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ అన్నారు. శుక్రవారం వసతిగృహంలో వివిధ విభాగాలను ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో వివిధ ప్రాంతాల విద్యార్థినులు డిగ్రీ, ఆపై చదువులు కోసం బీసీ, ఎస్సీ వసతి గృహాన్ని సుమారుగా 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనంపై కారిపోతోందన్నారు. సుమారుగా 180 మంది విద్యార్థులు మూడు గదులు మాత్రమే ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్, అంబేడ్కర్ సేవాసమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, ఆర్యవైశ్యుల సంక్షేమ సంఘం నాయకులు బొడ్డు సోమరాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజు, శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ ముగడా అప్పారావు, మహిళా నాయకురాలు భరణికాన రేవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నిక



నూతన కార్యవర్గం

గాజువాక: విశాఖ ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర సంఘం నుంచి ఎన్నికల పరిశీలకులుగా హాజరైన పి.ఉగ్రసేన, బి.రామభద్రరాజు, కె.రామకృష్ణ సమక్షంలో గాజువాక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వి.ఆనందరావు (యలమంచిలి), ప్రధాన కార్యదర్శిగా వి.అజయ్ కుమార్ (మల్కాపురం), ఉపాధ్యక్షురాలిగా పి.దమయంతి (నర్సీపట్నం), సహాయ అధ్యక్షుడిగా వై.వెంకటేశ్వర్లు (మాడుగుల), సహాయ కార్యదర్శిగా బి.సూర్యకళ (పెందుర్తి), ప్రచార కార్యదర్శిగా ఎల్.రాజేంద్రవర్మ (డీసీఎల్), కోశాధికారిగా కె.శ్రీనివాసరావు (తుమ్మపాల), రాష్ట్ర ప్రతినిధిగా ఎల్‌వీ రమణ, కార్యవర్గ సభ్యులుగా ఎన్‌వీనర్సింహం (అడవివరం), బీవీఎస్.అప్పారావు (పద్మనాభం), ఎం.సత్యవతి (పాడేరు), బి.చంద్రకళ (గాజువాక), బి.కనకరాజు (గాంధీగ్రాం), జి.పైడిరాజు (జెడ్‌జీఎస్) తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యకవర్గం మూడేళ్లపాటు కొనసాగుతుందని కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఉద్యోగులను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ గ్రంథాలయాల ప్రతినిధులు ఆర్.కన్నబాబు, ఓ.శ్రీనివాసరావు, వి.మోహన, ఆర్‌సీహెచ్.వెంకటరావు, పద్మావతి దేవి, పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు సింహగిరిపై శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతీ నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం శ్రీనృసింహ హోమాన్ని నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉదయం 7గంటలకు ప్రారంభమయ్యే హోమంలో రూ.2500 టికెట్టు తీసుకుని ఉభయదాతలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈసేవలో భక్తులు ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగా కానీ టికెట్టు తీసుకొని పాల్గొనవచ్చన్నారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో టికెట్లు లభిస్తాయని తెలిపారు. అలాగే www.aptemples.ap.gov.in టికెట్లు తీసుకోవచ్చని తెలిపారు.

అప్పన్న ఉద్యోగి సస్పెన్షన్

సింహాచలం : మద్యం సేవించి విధులకు హాజరైన సింహాచలం దేవస్థానం ఉద్యోగిని ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సస్పెండ్ చేశారు. సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బలిరెడ్డి సన్యాసిరావు విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం సన్యాసిరావు మద్యం సేవించి విధులకు హాజరై భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించాడు. ఫిర్యాదు రావడంతో ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌ను విచారణకు ఆదేశించారు. ఆనంద్‌కుమార్ విచారణ జరిపి మద్యం తాగి వచ్చింది వాస్తవమేనని నివేదిక ఇవ్వడంతో సన్యాసిరావును సస్పెండ్ చేశారు.

అటవీ శాఖలో అదే దందా!

- అనుకూల అధికారిని రప్పించేందుకు యత్నాలు
- బదిలీల్లో చక్రం తిప్పుతున్న కలప వ్యాపారులు



జిల్లా అటవీశాఖ కార్యాలయం

నర్సీపట్నం: అటవీశాఖలో బదిలీలు కాక పుట్టిస్తున్నాయి. చట్టవ్యతిరేక కార్యకలాపాలు యథేచ్ఛగా కొనసాగించుకునేందుకు వీలుగా అనుకూలమైన అధికారిని తెచ్చుకునేందుకు కలప స్మగ్లర్లు, రంగురాళ్ల వ్యాపారులు చక్రం తిప్పుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తున్నాయి. గతంలో పనిచేసి వివాదాల్లో చిక్కుకొని బదిలీపై వెళ్లిన అధికారిని తిరిగి అదే పోస్టులోకి తీసుకురావడానికి కొందరు నాయకులు చేస్తున్న ప్రయత్నాలపై అటవీశాఖ ఉద్యోగులే విస్తుపోతున్నారు. ఆ అధికారి పనిచేస్తున్న సమయంలో.. పొలంలో చెట్టు చూస్తే ఎంత ఇవ్వాలి.. కటింగ్ అనుమతికి ఎంత ఇచ్చుకోవాలి అంటూ అప్పట్లో టీడీపీ నాయకులు విమర్శలు గుప్పించారు. అక్రమ కలప వ్యాపారం, రంగురాళ్ల తవ్వకాలు జరుపుకునేందుకు కలప, రంగురాళ్ల వ్యాపారులు వివాదాస్పద అధికారిని రప్పించేందుకు కొంతమంది నాయకుల ద్వారా తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అటవీశాఖలో బదిలీలు ఇలా కాక పుట్టిస్తుండగా.. మరోపక్క ఇటీవల అనకాపల్లిలో వన మహోత్సవ కార్యక్రమంలో స్వయంగా శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. సామిల్లులే కేంద్రంగా అక్రమ కలప వ్యాపారం సాగుతోందని స్పీకర్ ఆ సభలో వ్యాఖ్యానించారు. అటవీశాఖలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్‌సింగ్‌కు ఆధారాలు చూపిస్తూ, విచారణ జరపాలని ఆదేశించారు. ఒకపక్క అయ్యన్నపాత్రుడు అలా చెబుతుండగా.. టీడీపీకే చెందిన నేతలు వివాదాస్పద పూర్వ అధికారిని తీసుకురావడానికి మరో పక్క పావులు కదుపుతున్నారు.

నర్సీపట్నం డివిజన్‌కు తరగని క్రేజ్

ఒకప్పుడు నర్సీపట్నం అటవీ డివిజన్‌కు మంచి క్రేజ్ ఉండేది. విస్తారమైన ఖనిజ సంపద, రంగురాళ్ల క్వారీలు, వందల ఏళ్ల నాటి టేకు ప్లాంటేషన్లు ఉండేవి. జిల్లాల పునర్విభజనలో నర్సీపట్నం డివిజన్‌లో ఉన్న కీలకమైన అటవీ ప్రాంతమంతా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలిసిపోయింది. ఇప్పుడు నామమాత్రంగానే అడవి ఉంది. వెదురు వనాలు, వందల ఏళ్ల నాటి టేక్ ప్లాంటేషన్లు లేవు. అయినప్పటికీ నర్సీపట్నం రేంజ్‌లో పోస్టింగ్ కోసం వివాదాల అధికారి ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారన్న చర్చ నడుస్తోంది. నర్సీపట్నం డివిజన్‌లో 12 సామిల్లులు ఉన్నాయి. ఈ కలప కోత మిల్లులే అటవీశాఖలో కొందరు అధికారులకు ఆదాయ వనరులుగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో డీఎఫ్‌వో విచారణ చేస్తున్నారు. వివాదాస్పద అధికారిని రప్పించేందుకు ఒక సామిల్లు యజమానికి ప్రస్తుత అధికారులు కొమ్ము కాస్తున్నారని కొందరు సామిల్లు నిర్వాహకుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. సామిల్లుల యజమానుల మధ్య ఏర్పడిన వర్గ విభేదాలతో కొంతమంది సామిల్లు యజమానులు అప్పట్లో డీఎఫ్‌వో రాజారావును ఏసీబీ అధికారులతో పట్టించారు. ఈ ఘటన తరువాత కొన్ని నెలలకు అటవీశాఖలో పరిస్థితులు చక్కబడడంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. కూటమి ప్రభుత్వం బదిలీలకు పచ్చజెండా ఊపడంతో నర్సీపట్నం అటవీ డివిజన్‌లో కీలకమైన పోస్టుకు డిమాండ్ పెరిగింది. వివాదాస్పద అధికారిగా ముద్రపడిన అధికారి ఇక్కడకు వచ్చేందుకు సామిల్లులు యజమానులు, రంగురాళ్ల వ్యాపారుల ద్వారా తీవ్ర ప్రయత్నాలు సాగిస్తునట్లు అటవీశాఖలో ప్రచారం జరుగుతోంది.

9 నుంచి యూసీ క్రికెట్ లీగ్



ట్రోఫీ ఆవిష్కరిస్తున్న జాన్‌వెస్లీ

విశాఖ స్పోర్ట్స్ : యునైటెడ్ ఇన్ క్రిస్టియన్ క్రికెట్ లీగ్ ఈనెల 9నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. డాక్టర్ వైఎస్సార్ స్టేడియం-బీ గ్రౌండ్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సెయింట్‌పాల్ చర్చ్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రోఫీని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ విభాగ చైర్మన్ జాన్‌వెస్లీ ఆవిష్కరించారు. వండర్ కిడ్ మాస్టర్ నేతన్ ఐజాక్ టోర్నీ సిల్వర్ కాయిన్, లోగోను విడుదల చేశారు. టోర్నీ నిర్వాహకుడు సునీల్ ఐజాక్ మాట్లాడుతూ క్రిస్టియన్ సంఘాల క్రికెట్ జట్లు ఈ టోర్నీలో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ మాథ్యూ పీటర్, రమేష్ జాన్వుడ్, సన్నీజోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ



ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక

తుమ్మపాల: ట్రాన్స్‌జెండర్ పోర్టల్‌లో లాగిన్ అయి దరఖాస్తు చేసుకున్న వారికి గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లు అందజేస్తామని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాన్స్‌జెండర్స్‌తో కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.దీపిక సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న ఏడుగురికి గుర్తింపు కార్డులతోపాటు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత ఇప్పటి వరకు జిల్లాలో 11 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లను మంజూరు చేశామన్నారు. ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొనే సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆధార్, రేషన్ కార్డులు, ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్‌ను ట్రాన్స్‌జెండర్లు కోరారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జగదీష్, పలువురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

శుభాలు కలిగించే స్వయంభూ విఘ్నేశ్వరుడు



ఆలయంలో కొత్తగా రూ. 3 కోట్లతో నిర్మించిన మూడు రాజగోపురాలు



స్వయంభూ విఘ్నేశ్వరుడి మూల విరాట్

శివపార్వతుల ప్రథమ కుమారుడు వినాయకుడు. సర్వవిఘ్నాలను తొలగించే దేవునిగా వినాయకుడు ప్రఖ్యాతి గాంచాడు. ఏ కార్యక్రమాన్ని అయినా ప్రారంభించే ముందు గణనాథుడిని పూజించడం హిందువుల ఆనవాయితీ. శనివారం ప్రారంభమయ్యే చవితి వేడుకలను తొమ్మిది రోజుల పాటు అతి వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం నుంచే జిల్లా వ్యాప్తంగా పండగ సందడి సంతరించుకుంది. ఆలయాలు ముస్తాబుకాగా, వీధివీధినా మండపాలు ఏర్పాటవుతున్నాయి.

చోడవరం: రాష్ట్రంలో అతిపురాతన, విశిష్టత కలిగిన స్వయంభూ విఘ్నేశ్వరాలయాలు రెండు ఉన్నాయి. వాటిలో ఒకటి చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఆలయం కాగా, రెండవది అనకాపల్లి జిల్లా చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయం.కోరిన కోర్కెలు తీర్చే బొజ్జగణపతిగా, శుభాలు కలిగించే వేల్పుగా ఇక్కడ స్వామి పూజలందుకుంటున్నారు. ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఆలయం ముస్తాబయింది. చోడవరంలో ప్రధాన రహదారిని ఆనుకుని తూర్పుదిశగా ఉన్న శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయానికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. సుమారు 300 ఏళ్లనాటి చరిత్ర కలిగిన ఈ ఆలయం నాటికాలంలో విఘ్నేశ్వరుని విశిష్టతకు నిదర్శనంగా నిలిచింది. ఇక్కడ విఘ్నేశ్వరుని విగ్రహం నడుము పైభాగం మాత్రమే దర్శనమిస్తుంది. స్వామివారి తొండం చివరిభాగం పైకి కనిపించదు. ఈ విగ్రహం ఏటేటా పెరుగుతుందనే ప్రతీతి ఉంది. పాతచెరువు ఒడ్డున ఉన్న ఈ స్వయంభూ వినాయకుని విగ్రహాన్ని పక్కనే ఉన్న శ్రీ స్వయంభూ గౌరీశ్వరాలయంలోకి తరలించడానికి అప్పట్లో తవ్వకాలు జరిపించగా ఎంతపాడవు తవ్వినా స్వామివారి తొండం చివరి భాగం కనిపించకపోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు పూర్వీకులు చెబుతున్నారు. తవ్వకాన్ని జరిపిన ప్రాంతాన్ని 'ఏనుగుబొ దె'గా పిలుస్తుంటారు. ఇప్పటి వరకు ఆలయానికి ఉత్తర రాజగోపురం మాత్రమే ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చొరవతో ఈ ఆలయానికి సుమారు రూ. 3కోట్ల వ్యయంతో తూర్పు, పశ్చిమం, దక్షిణ రాజగోపురాలు నిర్మించారు. సుమారు 40అడుగుల ఎత్తులో నిర్మించిన తూర్పు రాజగోపురం ఆలయానికి సరికొత్త ఆధ్యాత్మిక శోభను తెచ్చింది. అంతేకాంకుడా ఆలయానికి మాడవీధుల నిర్మాణంలో భాగంగా మూడు రాజగోపురాలను కలుపుతూ రోడ్డు వేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రతి బుధ, శుక్రవారాల్లో గణపతి, లక్ష్మీగణపతి హోమాలు, లోకకల్యాణం కోసం నిర్వహించే హోమాలు కోసం ప్రత్యేకంగా హోమ మండపం ఉంది. స్వయంభూ విఘ్నేశ్వర స్వామిని దర్శించుకోవడానికి అన్ని ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు నిత్యం వస్తుంటారు. స్వామివారికి నిత్యపూజలు, ప్రత్యేక కుంకుమార్చనలు జరుపుతారు. నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు.

రేపటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

ఈ ఏడాది వినాయచవితి పండగ, నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 7వ తేదీ నుంచి 15 వ తేదీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిపేందుకు భారీగా ఏర్పాటు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

కార్యసిద్ధి కలిగించే స్వామి

11సార్లు ప్రదక్షిణ చేసినంత మాత్రాన కార్య సిద్ధి కలిగించే స్వామిగా ఇక్కడ భక్తులు నమ్ముతారు. ఈ ఆలయానికి మొదటి సారి వచ్చిన భక్తులు ఆలయ గర్భగుడి చుట్టూ 11సార్లు ప్రదక్షిణ చేసి, కోర్కెలు తీరిన తర్వాత 48సార్లు ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. నవరాత్రి మహోత్సవాల్లో స్వామిని దర్శించుకోవడం భక్తులకు చాలా మంచిది.

- కొడమంచిలి చలపతిరావు, ఆలయ ప్రధాన అర్చకుడు, శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం, చోడవరం.

మహిమాన్వితుడు ఎ.కోడూరు ఏకదంతుడు



ఎ.కోడూరులో గల సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వరాలయం



సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వరుడు

కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరులో కొలువై ఉన్న సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామి కోరిన కోర్కెలు తీర్చే వేల్పుగా విరాజిల్లుతున్నాడు. ఇక్కడ ఆలయాన్ని 1993లో గ్రామానికి చెందిన పద్మశాలీ సంఘం సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మించారు. నాటి నుంచి నేటి వరకూ ఏకదంతుడికి నిత్యం విశేష పూజలను నిర్వహిస్తున్నారు. సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తే కోరికలు ఫలిస్తాయని భక్తుల నమ్మకం. దీంతో వినాయక నవరాత్రి ఉత్సవాలు, ఇతర పర్వదినాల సమయంలో ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు విజయనగరం జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడికి వచ్చి స్వామిని దర్శించు కుంటారు. ఇంత విశిష్టత కలిగిన ఆలయంలో ఈ ఏడాది వినాయక నవరాత్రి వేడుకలను శుక్రవారం నుంచి 15 వరకూ ఘనంగా నిర్వహించేందుకు పద్మశాలీ సేవా సంఘం సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఇక్కడికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం. జిల్లాలో సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వరుని ఆలయం ఎ.కోడూరులో మాత్రమే ఉండడంతో పెద్ద సంఖ్యలో భక్తులు నవరాత్రి పర్వదినాల్లో ఇక్కడికి వస్తుంటారు. ప్రతి రోజూ ఆలయ ప్రాంగణంలో ప్రసాద వితరణతో పాటు భజన కార్యక్రమాలను నిర్వహించనున్నాం.

– పొనగంటి రాంబాబు, చైర్మన్, ఆలయ అభివృద్ధి కమిటీ, ఎ.కోడూరు.

భక్త సులభుడు ఒడ్డిమెట్ట వినాయకుడు



లక్ష్మీగణపతి స్వామి

నక్కపల్లి : విఘ్నాలు తొలగించే వినాయకుడిగా, గ్రామీణ జిల్లా భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి స్వామి నవరాత్రి మహోత్సవాలు శనివారం నుంచి ఘనంగా జరగనున్నాయి. ఈనెల 7వ వతేదీ వినాయకచవితి నుంచి తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. చవితినాడు గణపతిని దర్శించుకునేందుకు అనకాపల్లి, యలమంచలి, నర్సీపట్నం, తుని, అన్నవరం, పాయకరావుపేట, నక్కపల్లి తదితర పట్టణాలనుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేకసబస్సులు నడుపుతారు. ఒడ్డిమెట్ట కైలాసగిరిపై నూరేళ్ల క్రితం తాటిచెట్టు మొదలులో లక్ష్మీగణపతి వెలిసినట్టు పూర్వీకుల కథనం. నామవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి స్వామి కలలో కనిపించి కైలాసగిరిపై పలానా చోట తాను వెలిసినట్టు చెప్పడంతో అక్కడ తవ్వకాలు జరుపగా విగ్రహం బయటపడింది. తరువాత కాలంలో విరాళాలు సేకరించి కొండపై ఆలయాన్ని నిర్మించారు. తర్వాత ఈ ఆలయం దేవదాయశాఖ ఆధీనంలోకి వెళ్లింది. గత ఏడాది ప్రభుత్వ నిధులు, దాతల నుంచి విరాళాలు సేకరించి రూ.20లక్షల వ్యయంతో కొండపైకి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో పాతరోడ్డును ఆనుకుని నిర్మించిన రోడ్డుమార్గం ద్వారా కూడా భక్తులు కొండపైకి చేరుకోవచ్చు.

పెద్ద ఎత్తున తిరునాళ్ల

వినాయక చవితినాడు ఇక్కడ పెద్ద ఎత్తున తిరునాళ్ల నిర్వహిస్తారు. వేకువ జామునుంచే స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరుతారు. ఈ ఆలయంలో గణపతిని దర్శించుకుని చేపట్టిన ప్రతి అభివృద్ధిపని నిర్విఘ్నంగా పూర్తవుతుందనేది భక్తుల నమ్మకం. ఇక్కడ గణపతి ఆలయంతోపాటు కాశీవిశ్వేశ్వర, కనకదుర్గ, నవగ్రహాలు, లక్ష్మీనారాయణ ఆలయాలు ఉన్నాయి. ఒడ్డిమెట్ట గ్రామస్తులు లక్ష్మీగణపతిని తమ ఇలవేల్పుగా కొలుస్తారు. వినాయక చవితిని వారు అత్యంత ఘనంగా జరుపుకొంటారు.

నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లుపూర్తి

నవరాత్రి మహోత్సవాలకు అన్నిఏర్పాట్లుపూర్తిచేసినట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కిరణ్మయి, అర్చకులు జయంతి గోపాల కృష్ణ తెలిపారు. 7వ తేదీ రాత్రి సాయంత్రం స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులకు సాధారణ దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు.

పోలీసు బందోబస్తు

వినాయకచవితి సందర్భంగా గణపతిని దర్శించుకునేందుకు వేలాది మంది తరలిరానుండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నక్కపల్లి సీఐ కుమార స్వామి, ఎస్ఐ సన్నిబాబు పర్యవేక్షణలో విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయరహదారిని ఆనుకుని ఆలయం ఉండడంతో ట్రాఫిక్‌జాం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మెట్లమార్గం వరకు వాహనాలను అనుమతించకుండా రోడ్డుపైనేపార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లుచేస్తున్నట్లు సీఐ తెలిపారు. భక్తులు క్యూలైన్ల ద్వారానే స్వామిని దర్శించుకోవాలన్నారు. నక్కపల్లి, పాయకరావుపేటలనుంచి పోలీస్ సిబ్బందిని రప్పించి బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు.



కైలాసగిరిపై ఉన్న లక్ష్మీగణపతి ఆలయం

ప్రభుత్వాస్పత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించండి

చోడవరం, కె.కోటపాడులో పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది నిరసన

చోడవరం రూరల్/కె.కోటపాడు: జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ కార్మికులు సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్షణ్ డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి కార్మికులతో కలసి శుక్రవారం ఆయన చోడవరం, కె.కోటపాడు సీహెచ్‌సీల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఆస్పత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ సూపర్‌వైజర్ల జీవితాలతో కాంట్రాక్టర్లు ఆడుకుంటున్నారని దుమ్మెత్తి పోశారు. వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఐదు నెలలుగా దశలవారీగా ఉద్యమాలు, శాంతియుత పద్ధతిలో నిరసనలు చేస్తున్నప్పటికీ సంబంధిత జిల్లా స్థాయి అధికార యంత్రాంగం దృష్టి సారించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కష్టార్జితం పీఎఫ్ సొమ్మును సైతం కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ నెల 15వ తేదీలోగా వారికి బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో ప్రకారం జీతాలు పెంచాలన్నారు. 2021 జూన్ నుంచి రావలసిన వేతనానికి తగిన పీఎఫ్ లెక్కలు వెల్లడించి, తక్షణం జమ చేయాలని, ఈఎస్ఐ కార్డులు ఇవ్వకుండానే ప్రతి నెలా వేతనంలో కోత పెడుతున్న మొత్తానికి అణాపైసలతో తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15లోగా సమస్యలు పరిష్కారం కాకుంటే మరుసటి రోజు నుంచి విధులు బహిష్కరిస్తామని కార్మికులు హెచ్చరించారు. పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది అరుణ, దేముడమ్మ, సత్యవతి, ఈశ్వరమ్మ, నాగేశ్వరరావు, అప్పలరాజు, శ్రీను, రామారావు, మంగ, నూకరత్నం, కోటిబాబు, నూకరాజు, కుమారి పాల్గొన్నారు.



కె.కోటపాడు సీహెచ్‌సీ వద్ద నిరసన చేపడుతున్న పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది

వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం

పరవాడ: అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.హరిప్రకాష్ పిలుపు మేరకు విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి విశాఖ ఫార్మాసిటీ రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ఈ మొత్తాన్ని రాష్ట్ర విపత్తు నివారణ సంస్థకు పంపించినట్లు ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్షి తెలిపారు. వరదల వల్ల జరిగిన నష్టాన్ని ఎవరూ పూడ్చలేరని.. బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సాయంగా రూ.10 లక్షలు అందించినట్లు ఆయన చెప్పారు. వరద బాధితులను ఆదుకోవడానికి ఫార్మాసిటీ ఉద్యోగులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ట్రాక్టర్ ఢీ కొట్టి మహిళ మృతి

రాంబిల్లి(యలమంచిలి): పాల ప్యాకెట్ కోసం వెళ్తున్న మహిళను ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందింది. రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాంబిల్లి మండలం వాడనర్సాపురానికి చెందిన ఉమ్మిడి మహాలక్ష్మి (55) శుక్రవారం రాత్రి తన గ్రామంలో కిరణా షాపులో పాల ప్యాకెట్ కొనుగోలు చేసేందుకు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, కొత్తపట్నం నుంచి వస్తున్న ట్రాక్టర్ ఆమెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దంచికొట్టిన వాన

- గంటలో 3 సెంటీమీటర్ల వర్షం
- పొంగిన గెడ్డలు, వాగులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం



యలమంచిలి పట్టణంలో పాత జాతీయ రహదారిపై నుంచి పొంగి ప్రవహిస్తున్న శేషుగెడ్డ

యలమంచిలి రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో యలమంచిలి పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకూ భారీ వర్షం కురిసింది. గంట సమయంలో దాదాపుగా మూడు సెంటీమీటర్లకు పైగా వర్షం కురవడంతో పట్టణానికి సమీపంలో కొండవాగులు, గెడ్డల్లో వర్షపునీరు పొంగి ప్రవహించింది. శేషుగెడ్డలో ప్రవాహ ఉధృతి పెరగడంతో యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో పాత జాతీయ రహదారిపై నుంచి ఆరడుగుల ఎత్తులో వర్షపునీరు ప్రవహించింది. దీంతో ఆ మార్గంలో రెండు గంటల సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు వాహనాల రాకపోకలను రాంనగర్, ఎర్రవరం మీదుగా మళ్లించారు. ఓ గంట సేపు వర్షం కురిస్తే చాలు శేషు గెడ్డలో నీరు రహదారిపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో తరచూ ఇక్కడ రాకపోకలు నిలిచిపోతున్నాయి. గెడ్డకు రెండు వైపులా ఆక్రమణలు, పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహం ముంచెత్తుతోందని స్థానికులు చెబుతున్నారు. భారీ వర్షానికి పట్టణంలోని పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. పలుచోట్ల కాలనీలో వర్షపు నీరు నిలిచిపోవడం, రహదారులు బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. స్థానిక రాజీవ్ క్రీడా మైదానం చెరువులా మారిపోవడంతో క్రీడాకారులు సాధన చేయడానికి ఆటంకం ఏర్పడింది. మరోవైపు వినాయక చవితి వేడుకలకు సంబంధించి పూజా సామగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేయడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి యలమంచిలి వచ్చిన ప్రజలంతా వర్షం కారణంగా తడిచిపోయారు. చిరు వ్యాపారులు సైతం వర్షంతో అవస్థలు ఎదుర్కొన్నారు.

ముంపునకు గురైన 420 ఎకరాల వరి

తుమ్మపాల: అడపాదడపా కురుస్తున్న వర్షాలకు అనకాపల్లి మండలంలోని తొమ్మిది గ్రామాల్లో వరి పంట పూర్తిగా ముంపునకు గురైంది. గురువారం వరకు సాధారణ పరిస్థితులు ఉన్నప్పటికీ శుక్రవారం సాయంత్రానికి శంకరంతోపాటు తుమ్మపాల, మార్టూరు, రేబాక గ్రామాల్లోని వరి పొలాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. ఊడేరు వద్ద గైరమ్మ గెడ్డ గట్లు విరిగిపోవడంతో పంట కాలువల్లో పూడిక తీయక ముంపునకు గురయ్యాయని రైతులు వాపోతున్నారు. దాదాపు 700 ఎకరాల వరకు వరిపంట ముంపునకు గురవగా, 420 ఎకరాల్లో మాత్రమే నష్టం సంభవించినట్లు వ్యవసాయ అధికారుల లెక్కలు చూపడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో పరిశీలన చేసి నష్ట జాబితా తయారు చేయాలని కోరుతున్నారు.

పిడుగుపడి పాడి రైతు మృతి



భూపతిపాలెంలో రాకోటి అర్జున మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అనకాపల్లి: తుఫాన్ కారణంగా పిడుగుపడి పాడి రైతు రాకోటి అర్జున (64) అక్కడికక్కడే మృతి చెందాడు. రెవెన్యూ, రూరల్ పోలీసుల కథనం మేరకు.. మండలంలో కోడూరు రెవెన్యూ పరిధి భూపతిపాలేనికి చెందిన పాడి రైతు అర్జున శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలోని నల్లమారమ్మగుడి సమీపంలో పశువులు కాస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం పడింది. ఉరుములు, మెరుపులు వచ్చి పిడుగు పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నట్లు తహసీల్దార్ వై.శ్రీరామ్మూర్తి చెప్పారు.

ప్రమాద స్థాయిలో పెద్దేరు

మాడుగుల: కేచ్‌మెంట్ ఏరియాలో అధిక వర్షాలు కురవడంతో శుక్రవారం సాయంత్రానికి పెద్దేరు జలాశయం ప్రమాద స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం 300 క్యూసెక్కులు వరద జలాశయంలోకి వస్తోంది. అధికారులు అప్రమత్తమై ప్రధాన గేటు ద్వారా వచ్చిన వరద నీరు కిందకు విడుదల చేస్తున్నారు.

బురదలో కూరుకుపోతున్న వాహనాలు

- తరచూ ట్రాఫిక్ అంతరాయం



బురదలో కూరుకుపోయిన గ్రానైట్ లారీని బయటకు తీస్తున్న జేసీబీ



బురదలో కూరుకుపోయిన లారీ

బుచ్చెయ్యపేట: మండలంలో బుదిరెడ్లపాలెం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై బురదలో లారీలు, ట్రాలీలు కూరుకుపోతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లో ఇతర వాహనాలు చిక్కుకుంటున్నాయి. భీమునిపట్నం, నర్సీపట్నం రహదారిలో శుక్రవారం లారీలు, వ్యాన్‌లు, ట్రాలీలు బురదలో కూరుకుపోయాయి. ఇక్కడ ఆర్అండ్‌బీ రోడ్డు పొలాల్లో మట్టిరోడ్డు కంటే దారుణంగా తయారైంది. దాంతో బురదలో కూరుకుపోయిన వాహనాలను జేసీబీలతో బయటకు లాగుతున్నారు. రోజూ ఈ పరిస్థితి నెలకొందని, పాలకులు పట్టించుకోకపోవడంపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జాబ్ మేళాలో 64 మంది ఎంపిక

చోడవరం రూరల్: ఏపీ స్కిల్ హబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 64 మందిని ఉద్యోగార్థం ఎంపిక చేశారు. మేళాకు 157 మంది నిరుద్యోగులు హాజరు కాగా, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు, హెటిరో ఫార్మా కంపెనీలు చెరి 15 మందిని, కె.ఎల్.గ్రూప్స్ 34 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, స్కిల్ హబ్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయా కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు ఎంపికైన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేశారన్నారు. జాబ్‌మేళాకు ముందు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గతేడాది రెండు సార్లు ఇటువంటి మేళాలు నిర్వహించామని, ఈ ఏడాది మరిన్ని నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అప్పలనాయుడు, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రితీష్, ఎస్ఎస్ఎస్ పీవో డి.మాల్యాద్రి, పీడీ మూర్తి పాల్గొన్నారు.



జాబ్‌మేళాను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

క్లుప్తంగా

రూ.7 లక్షలతో చురుగ్గా సీసీ రోడ్డు పనులు



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, ఏఈ పీఆర్ కుమార్

అనకాపల్లి: తుమ్మపాల పంచాయతీ విద్యుత్ నగర్ గ్రామంలో 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.7లక్షల తో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. శుక్రవారం రహదారి పనులను ఆయన శంకుస్థాపన చేశారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని సర్పంచ్ తెలిపారు. తాగునీరు, సీసీ రోడ్లు, పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ పీఆర్ కుమార్, 14వ వార్డు మెంబర్ కొయ్య జగదీష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం సందర్శన



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీష

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీష సందర్శించారు. కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించి పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చడానికి చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి కూర్మారావుకు ఆమె సూచించారు. కేంద్రం నిర్వహణపై పలు సూచనలు చేశారు. డీపీఆర్‌సీ సమన్వయకర్త నాగమణి, ఈవోఆర్‌డీ ఎం.సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికకు కరెన్సీ నోట్లతో అలంకరణ



కశింకోటలో కరెన్సీ నోట్ల మాలతో ఆకట్టుకుంటున్న నూకాంబిక అమ్మవారు

కశింకోట: కశింకోటలో కొలువైన నూకాంబిక అమ్మవారిని రూ.10 కరెన్సీ నోట్ల మాలతో శుక్రవారం అలంకరించారు. ఓ భక్తుడు రూ.2 వేలు విలువైన రూ.10 నోట్లను మాలగా సమర్పించారు. ఇది భక్తులను ఆకట్టుకుంది. ఆలయ అర్చకుడు వేగి శివగణేష్ ఆధ్వర్యంలో పూజలు చేసి, అమ్మవారికి సమర్పించారు.

ఓ బొజ్జ గణపయ్య.. తొలి పూజ నీకయ్య

- ఊరూ వాడా వినాయక చవితి సందడి
- వీధి వీధినా మండపాలు, చలువ పందిళ్లు
- పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళ



నెహ్రూచౌక్ వద్ద వినాయక పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి: విఘ్నాధిపతి గణనాథుడి పూజలకు నియోజకవర్గం ముస్తాబైంది. వీధివీధిన మండపాలు వెలిశాయి. వీటిలో శనివారం బొజ్జ గణపయ్య కొలువుదీరనున్నాడు. భక్తులకు వరాలు కురిపించేందుకు లంబోధరుడు భువికి దిగిరానున్నాడు. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గంలో శుక్రవారం నుంచే సందడి మొదలయింది. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ ఇప్పటికే పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజాప్రతినిధులు పర్యావరణ ప్రేమికులు భారీగా మట్టి గణనాథుడి ప్రతిమలను పంపిణీ చేశారు. గణపతి పూజకు కావలసిన అన్ని రకాల పండ్లు, పువ్వులు, వివిధ రకాల పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్‌లు కిక్కిరిసిపోయాయి.

ఆకాశాన్నంటిన ధరలు

వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. చిన్నపాటి గణపతి ప్రతిమ నుంచి పెద్ద గణపతి వరకూ రూ.50లు నుంచి రూ.15వేలు వరకూ పలికింది. చిన్న పువ్వుల దండ రూ.200 పలకగా, నాలుగు పండ్లు రూ.100కు విక్రయించారు. డజన్ అరటి పండ్లు రకాన్ని బట్టి రూ.100 నుంచి రూ.150, కొబ్బరి కాయ చిన్నది రూ.25కు అమ్మకాలు సాగాయి.

విస్తృతంగా మట్టి ప్రతిమల పంపిణీ

- మండలంలో గుండాల జంక్షన్ వద్ద గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషన్ శ్రీధర్ మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- మార్టూరు గ్రామంలో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో మార్టూరు గ్రామం, హైస్కూల్ విద్యార్థులకు 400 మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయ, సంస్థ ప్రతినిధులు డి.నూకేష్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.
- స్థానిక నర్సింగరావుపేటలో ఎంవీఆర్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి సూర్యకుమారి 500 మట్టి గణపతులను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పూల దండలు



నెహ్రూచౌక్‌లో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న పట్టణ సీఐ టీవీ విజయకుమార్

- స్థానిక నెహ్రూచౌక్ వద్ద వినాయక నిమజ్జనోత్సవ వ్యవస్థాపక కమిటీ ఆధ్వర్యంలో పట్టణ సీఐ జీవీ విజయకుమార్ మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణపతి నవరాత్రి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శనివారం వివిధ ప్రాంతాల్లో గణపతి పూజలు చేసిన అనంతరం శారదానది ఒడ్డున నిమజ్జనం చేస్తారని, అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక నిమజ్జనోత్సవ వ్యవస్థాపకుడు ఆడారి కుమారస్వామి, కమిటీ సభ్యులు మళ్ల సురేంద్ర, కొణతాల హరనాథ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక లక్ష్మీదేవిపేటలో పీలా రాజారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా 1000 మట్టి గణపతులను ట్రస్ట్ చైర్మన్ పీలా తులసీరామ్ పంపిణీ చేశారు.

చవితి ఉత్సవాలకు సన్నాహాలు

కశింకోట: వినాయక చవితి ఉత్సవాలకు సన్నాహాలు చేశారు. కశింకోటతో పాటు బయ్యవరం, తాళ్లపాలెం, కన్నూరుపాలెం, నరసింగబిల్లి, చింతలపాలెం తదితర గ్రామాల్లో భారీ సెట్టింగ్‌లు, ప్రత్యేక అలంకరణలతో పందిళ్లు ఏర్పాటు చేశారు. కశింకోట సంతలో పూజా ద్రవ్యాలు, పత్రిలు, వినాయక ప్రతిమల అమ్మకాలు జోరుగా సాగాయి.



నర్సింగరావుపేటలో మట్టి ప్రతిమలు అందిస్తున్న ఎంవీఆర్ సేవా సంస్థ ప్రతినిధి సూర్యకుమారి



మార్కెట్‌లో వినాయక పూజా పత్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



లక్ష్మీదేవిపేటలో మట్టి గణపతులు అందిస్తున్న పీలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పీలా తులసీరామ్

ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలు



మాట్లాడుతున్న సీఐ స్వామినాయుడు

కశింకోట: వినాయక ఉత్సవాలకు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనధికారికంగా విద్యుత్‌ను వినియోగించరాదన్నారు. దీని వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులకు సూచించామన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



తాళ్లపాలెంలో పారిశుధ్య పనుల తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో వి.వి.రవికుమార్

కశింకోట: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో వి.వి.రవికుమార్ ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందు జాగ్రత్తగా వ్యాధులు సోకకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సత్యారావుకు పలు సూచనలు చేశారు.

మూలపేట రైతు సంఘం అధ్యక్షుడిగా నాని

మునగపాక: మూలపేట రైతు సంఘం అధ్యక్షుడిగా కె.నాని ఎన్నికయ్యారు. రామాలయంలో శుక్రవారం రాత్రి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా చిన అప్పలనాయుడు, కోశాధికారిగా ఎస్.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



మాట్లాడుతున్న ఎన్టీఆర్ వైద్యాలయం మత్తు విభాగం వైద్యుడు గోపీకృష్ణ

అనకాపల్లి: మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలు చిత్తు అయిపోతాయని, విద్యార్థులు గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎన్టీఆర్ వైద్యాలయం మత్తు విభాగం వైద్యుడు గోపీకృష్ణ సూచించారు. స్థానిక పూల్‌బాగ్ రోడ్డు రహదారి ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడకం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. పట్టణ దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రాములమ్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. యువత గంజాయి కేసుల్లో ఎక్కువగా నిందితులుగా జైలు పాలవుతున్నారని, కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ ప్రభుత్వాలు కళాశాలల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని కోరారు. అడ్వకేట్ జి.సురేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.శివాజీ, కళాశాల ప్రిన్సిపాల్ డి.స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు రేపు



మాట్లాడుతున్న భరిణికాన సాయినాథరావు

అనకాపల్లి: జిల్లాలో ఈ ఏడాది పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన యాదవ విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్టు జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భరిణికాన సాయినాథరావు తెలిపారు. స్థానిక రామచంద్ర థియేటర్ సమీప యాదవ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారి లక్ష్మీగ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ వేడుక జరుగుతుందన్నారు. కొత్తగా జిల్లా యాదవ సంఘం ఏర్పాటు చేశామన్నారు. మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు భరణికాన నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శులు సబ్బి శ్రీనివాస్, కరక సోమినాయుడు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాలు

- 9 గ్రామాల్లో 420 ఎకరాల్లో నష్టం
- అనుకోకుండా వచ్చి చేరిన వరద



శంకరంలో ముంపునకు గురైన వరి పొలాలు

వరి పంట ముంపుపై అధికారుల అంచనా

గ్రామం	ముంపునకు గురైన పొలాలు (ఎకరాల్లో..)	నష్టపోయిన రైతులు
ఊడేరు	70	130
సీతానగరం	07	20
కుంచంగి	20	15
తుమ్మపాల	20	30
శంకరం	135	160
రేబాక	40	60
సిహెచ్ఎన్ అగ్రహారం	2.5	05
అనకాపల్లి నార్త్-2	32	45
అనకాపల్లి సౌత్-2	100	120
మొత్తం	426.5	585

తుమ్మపాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో 9 గ్రామాల్లో వరి పంట పూర్తిగా ముంపునకు గురైంది. శంకరం గ్రామంలో పొలాల్లో కనుచూపు మేర వరి నాట్లు కనిపించలేదు. గురువారం వరకు సాధారణ పరిస్థితులు ఉన్నప్పటికీ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శంకరంతో పాటు తుమ్మపాల, మార్టూరు, రేబాక గ్రామాల్లో వరి పొలాల్లో భారీ నీరు చేరింది. నిన్నటి వరకు వరినాట్లు చేసిన రైతులకు ఊహించని విధంగా ముంపు రావడంతో లబోదిబోమంటున్నారు. భారీ వర్షాలతో పొంగిన వాగులు, గెడ్డల ద్వారా పారుతున్న నీటితో పాటు మండలంలో ఊడేరు వద్ద గైరమ్మ గెడ్డ గట్టు తెగిపోవడంతో బవులువాడ, తుమ్మపాల గ్రామాల మీదుగా భారీ నీరు ఆవఖండంలో చేరుతుంది. పంట కాలువల్లో పూడిక కూడా ఈ ముంపునకు కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి విస్తరణలో పులి కాలువ పూర్వ స్థితికి భిన్నంగా తక్కువ నీరు పారే విధంగా నిర్మాణం చేపట్టడంతో దిగువకు నీరు పోయే అవకాశం తక్కువగా ఉంటుంది. అందుకే శంకరం, సౌత్-2 ప్రాంతాల్లో నీరు నిలిచిపోయిందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటితో పాటు కుంచంగి, సీతానగరం గ్రామాలతో కలిపి మొత్తం దాదాపు 700 ఎకరాల వరకు వరి పంట నీటి మునిగింది. వ్యవసాయ అధికారులు మాత్రం 420 ఎకరాల్లోనే నష్టం వాటిల్లినట్టు అంచనా వేయడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో పరిశీలన చేసి, నివేదిక రూపొందించాలని కోరుతున్నారు.

- మునగపాక మండలంలో గేట్లు ఎత్తేందుకు రైతుల నుంచి అడ్డంకులు రావడంతోనే మండలంలో నీరు వరి పొలాల్లో నిలిచిపోయి ముంపునకు కారణమైనట్లు వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. దీంతో శుక్రవారం మండలంలో పలు ప్రాంతాల్లో అధికారులు పర్యటించి వాగులు, గెడ్డల ద్వారా పారుతున్న నీటి ప్రవాహంపై నివేదికలు సిద్ధం చేశారు. శంకరం గ్రామం నుంచి జాతీయ రహదారి వద్ద కాలువ వెడల్పు తక్కువగా ఉండడంతో పాటు ఆవఖండం దాటి తోటాడ, నాగులాపల్లి, మునగపాక వద్ద కాలువలకు గేట్లు ఎత్తేయడం ద్వారా కొండకర్ల ఆవకు నీరు పోయే అవకాశం ఉన్నప్పటికి అక్కడ రైతుల పొలాలు ముంపునకు గురవుతాయనే కారణంతో అడ్డుకుంటున్నారని మండల వ్యవసాయ అధికారి పి.వి.బి.రంగాచారి తెలిపారు.

మాలల ఐక్యత సమావేశం రేపు

మునగపాక : ఎస్సీ రిజర్వేషన్ ఉప వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా ఆదివారం అనకాపల్లిలో జిల్లా మాలల ఐక్యతా సమావేశం జరగనుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, దళిత నాయకుడు కోనపల్లి రామ్మోహనరావు తెలిపారు. శుక్రవారం స్థానికంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని కోరారు. ఈ తీర్పుతో షెడ్యూల్ కులాల్లో కొన్ని కులాలకు నష్టం జరుగుతుందన్నారు.

ఉమ్మడి రిజర్వేషన్‌ను అలాగే కొనసాగించాలన్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి గాంధీనగర్‌లోని రామాలయం వీధిలో కేజేఏ ఫంక్షన్ హాలులో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో దళిత నాయకులు రాజాన బుజ్జిబాబు, గుంట్ల అప్పారావు, పిట్టా అప్పారావు, లంబా అప్పారావు, బీలా శివగణేష్, బీలా లక్ష్మణరావు, పిల్లి అప్పారావు, తట్టా అశోక్‌కుమార్, మురళి పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 65 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,800
రెండో రకం	3,400	3,400
మూడోరకం	3,350	3,350

అనకాపల్లి సినిమాలు

35.. చిన్న కథ కాదు : రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ : సత్యనారాయణ 1
కమిటీ కుర్రోళ్లు : సత్యనారాయణ స్క్రీన్-2
సింబా : పర్తిసాయి
సరిపోదా శనివారం : షిర్డీ సాయి
డబుల్ ఇస్మార్ట్ : వెంకటేశ్వర
మారుతీనగర్ సుబ్రమణ్యం : శ్రీసత్య
డిమోంటి కాలనీ-2 : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 16 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-6, ఓ పాజిటివ్-9 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 387 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఫోన్ నంబర్ 0892-4223595లో సంప్రదించవచ్చు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం

కశింకోట: స్థానిక ఉప్పునీటి దిబ్బ వద్ద కొలువైన వినాయక ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూలమాలలతో స్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ

కశింకోటలో భారీ వర్షం

కశింకోట: కశింకోట ప్రాంతంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో అకస్మాత్తుగా కురిసిన వర్షం వల్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక పీహెచ్‌సీకి వెళ్లే మార్గం నీటితో నిండింది. ఆర్టీసీ బస్ స్టేషన్ బురదమయంగా మారింది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.



కశింకోటలో పడుతున్న వర్షం



కశింకోట పీహెచ్‌సీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు